క్లుప్తంగా

ఎస్‌ఎంసీ నూతన కమిటీల ఏర్పాటుకు నోటిఫికేషన్

కొల్చారం(నర్సాపూర్‌): ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఎస్‌ఎంసీ కమిటీల ఏర్పాటు కోసం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో శనివారం నోటిఫికేషన్‌ జారీ చేశారు. నోటిఫికేషన్‌ జారీలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రుల లిస్టును పాఠశాలల్లో ప్రదర్శించారు. కమిటీల ఏర్పాటుకు సంబంధించి మండల విద్యాధికారి నీలకంఠ మాట్లాడుతూ.. 22, 23 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 24న విద్యార్థుల తుది లిస్టు ప్రకటిస్తారన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్‌): మెదక్‌ జిల్లా మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం శ్రీనివాస్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్‌, పలువురు నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మంగళి కృష్ణ, నాయకులు సుభాష్‌ నాయక్‌ ఉన్నారు.

ఇంటర్నేషనల్‌ స్కూల్‌ ఏర్పాటుకు స్థలం పరిశీలన

రేగోడ్‌(మెదక్‌): మండల కేంద్రం రేగోడ్‌లో ఇంటర్నేషనల్‌ స్కూల్‌ ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులు స్థలం పరిశీలించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు గ్రామ శివారులో సుమారు పది ఎకరాల భూమిని గుర్తించారు. ఈ విషయమై ఆర్‌ఐ ఫిరోజ్‌ వద్ద శనివారం ప్రస్తావించగా ఇంటర్నేషనల్‌ స్కూల్‌ ఏర్పాటు కోసం స్థలం పరిశీలించారన్నారు. స్కూల్‌ ఏర్పాటుకు కావాల్సిన స్థలం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

ఇంక్రిమెంట్‌ పెంచండి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

తూప్రాన్‌: టోల్‌ప్లాజాలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న బీఆర్‌టీయూ కార్మికులకు ఇంక్రిమెంట్‌ ఇవ్వాలని కోరుతూ టోల్‌ ప్లాజా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు నిర్వాహకులకు శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్‌, లక్ష్మణ్‌, నారేందర్‌, మహేశ్‌గౌడ్‌, సాజిద్‌పాషా, రమేశ్‌గౌడ్‌, రవీంద్రనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని తునికి ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని గ్రామ మత్స్య సహకార సంఘం చైర్మన్‌ కుమార్‌ శనివారం కోరారు. తునికి గేట్‌ వద్ద గల ఉన్నత పాఠశాలలో ప్రహరీ లేదని, మధ్యాహ్న భోజనానికి మంచి నీటి సమస్య ఉందన్నారు. పాఠశాల డోర్లు, కిటికీలు చెదలుపట్టి ధ్వంసమయ్యాయన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగమాధురి

హవేళిఘణాపూర్‌(మెదక్‌): వరి పంటకు కాండం తొలిచే పురుగు నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏవో నాగమాధురి అన్నారు. మండలంలోని ఫరీద్‌పూర్‌ గ్రామంలో కాండం తొలిచే పురుగు సోకిన వరి పంటకు కార్బొఫ్యూరాన్‌ మందును పిచ్చికారీ చేయాలన్నారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ బ్రహ్మం, ఎంపీటీసీ రాజయ్య ఉన్నారు.

ఆలయాలు ముస్తాబు

చిన్నశంకరంపేట(మెదక్‌): ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. చిన్నశంకరంపేట, నార్సింగి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇంటిని కూల్చిన వ్యక్తులపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్‌): నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల పరిధిలోని రూప్ల తండాకు చెందిన బాలోత్‌ లక్ష్మణ్‌ కొత్తగా ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. శనివారం ఇదే తండాకు చెందిన దేవావత్‌ రామ్‌సింగ్‌, రూప్‌సింగ్‌, దిప్ల, చందర్‌ జేసీబీతో ఇంటి నిర్మాణ గోడలు కూల్చివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి



చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): ప్రజలు, పాలకులు, అధికారుల సహకారంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వినోదరెడ్డి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు పలువురు సర్పంచ్‌లు విద్యుత్‌, రోడ్ల సమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ సమావేశానికి హాజరై, సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో నిర్వహించే జీపీడీపీ లక్ష్యాల గురించి వివరించారు. 2024 – 25 సంవత్సరానికి ప్రతీ శాఖకు సంబంధించిన అధికారి సహకారంతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ శశిప్రభ విద్యుత్‌ శాఖ ఏఈ రాంబాబు, పీఆర్‌ ఏఈ మధుబాబు, ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ శ్యాంకుమార్‌, మండల ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సంతోషిమాత, ఏపీఎం ప్రేమలత, హెల్త్‌ సెక్రటరీ సృజన, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్‌): గ్రామాలు అభివృద్ధి చేసేందుకు అవసరం ఉన్న ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ హరికృష్ణ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్‌ ప్లానింగ్‌) పై వివిధ శాఖల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి 2030 సంవత్సరం వరకు చేసే లక్ష్యాలను చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, పీఆర్‌ ఏఈ భాస్కర్‌రావు, ట్రాన్స్‌ కో ఏఈ దుర్గప్రసాద్‌, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.



శివ్వంపేటలో ..

వెల్దుర్తి(తూప్రాన్‌): మాసాయిపేట మండలం హకీంపేట గ్రామానికి చెందిన నవ్య అత్యవసర చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో రూ.1 లక్ష మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి నర్సాపూర్‌ క్యాంప్‌ కార్యాలయంలో అందజేశారు.

పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు

హవేళిఘణాపూర్‌(మెదక్‌): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అవసరమైన మౌళిక సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని హవేళిఘణాపూర్‌ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కూచన్‌పల్లి, ఫరీద్‌పూర్‌ ఆయా గ్రామాల్లో పాఠశాలలో అవసరం ఉన్న వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై పూర్తి వివరాలు సేకరించినట్లయితే ఎంపీపీ నిధుల ద్వారా పనులు చేపట్టేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు దేవాగౌడ్‌, పీఆర్‌ ఏఈ సాల్మన్‌, మధుసూదన్‌ తదితరులు ఉన్నారు.



హవేళిఘణాపూర్‌(మెదక్‌): పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ

కొనసాగుతున్న రోడ్డు భద్రతా వారోత్సవాలు

తూప్రాన్‌: పురపాలక పరిధిలోని తూప్రాన్‌ టోల్‌ ప్లాజా సమీపంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జీఎమ్మార్‌ వరలక్ష్మి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి, సికింద్రాబాద్‌ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ వెంకటరమణ మాట్లాడుతూ.. వాహనదారుల కంటి చూపు సరిగా లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ప్రతి వాహనదారుడు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ పోచంపల్లి హైవేస్‌ సిబ్బంది, రక్షా సిబ్బంది, పుష్పగిరి కంటి ఆస్పత్రి కోఆర్డినేటర్‌ వేణు ప్రసాద్‌, ఫౌండేషన్‌ ఇన్‌చార్జి శ్రీనివాస్‌, వాహనదారులు పాల్గొన్నారు.



వాహనదారులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యుత్‌షాక్‌తో మూడు గేదెల మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన పశువులు

పెద్దశంకరంపేట(మెదక్‌): మండల పరిధిలోని రామోజిపల్లి గ్రామంలో విద్యుత్‌ షాక్‌తో శుక్రవారం రాత్రి మూడు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద విద్యుత్‌ వైర్లు తెగిపోవడంతో గ్రామానికి చెందిన బాసాడ సురేశ్‌, శ్రీశైలం, హన్మంతుగారి వెంకటేశంలకు చెందిన గేదెలు మృతి చెందాయి. దీంతో సుమారు రూ.1 లక్షా 30 వేల నష్టం సంభవించినట్లు బాధిత రైతులు తెలిపారు. ఈ సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ బాలరాజు, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, సర్పంచ్‌ మంజుల అశోక్‌, మాజీ సర్పంచ్‌ రాంచందర్‌లు పరిశీలించారు. ప్రభుత్వం, విద్యుత్‌ శాఖ అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

సెంట్రింగ్‌ డబ్బాలు చోరీ

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల కేంద్రం శివ్వంపేటలో గుర్తు తెలియని వ్యక్తులు సెంట్రింగ్‌ డబ్బాలు చోరీ చేశారు. గ్రామ శివారు తూప్రాన్‌ – నర్సాపూర్‌ హైవే పక్కన యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్నస్వామి ఆలయం నిర్మిస్తున్నారు. అందుకు సంబంధించి పనులకు సెంట్రింగ్‌ డబ్బాలు తీసుకొచ్చారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 120 సెంట్రింగ్‌ డబ్బాలను దొంగలిచ్చారు. సంఘం నేతలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రవికాంత్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

పరీక్షల ముందు పాఠశాల ఎన్నికలా..?

వెల్దుర్తి(తూప్రాన్‌): ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో నిర్వహించాల్సిన ఎన్నికలను, వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో నిర్వహించడం సరైన నిర్ణయం కాదన్నారు.

విద్యార్థిని ప్రతిభ



శ్రీవాణి

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ఈ నెల 18, 19వ తేదీల్లో మెదక్‌ జిల్లా స్థాయి వైజ్ఞానిక అంతర్జాల సమావేశం ప్రదర్శనలో జరిగిన కాళ్లకల్‌ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని శ్రీవాణి ప్రతిభ చాటింది. మూడంకెల కాలిక్యులేటర్‌, కంప్యూటేషనల్‌ థింకింగ్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం వెంకటస్వామి తెలిపారు. మార్గదర్శక ఉపాధ్యాయురాలిగా మమత వ్యవహరించినట్లు వెల్లడించారు.

పేదలకు వరం కేంద్ర ప్రభుత్వ పథకాలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదలకు వరమని వెల్మకన్న సర్పంచ్‌ కాజీపేట రాజేందర్‌ అన్నారు. వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం వెల్మకన్నలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్‌ లక్ష్మీకాంతరెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్‌): మండలంలోని పాంబండ గ్రామంలో వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్‌, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక



మాట్లాడుతున్న పాఠశాల హెచ్‌ఎం

కొల్చారం(నర్సాపూర్‌): ఈ సంవత్సరం జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు సాగుతున్నట్లు మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో పరీక్షలు ప్రారంభమయ్యే తరుణంలో పిల్లలను తల్లిదండ్రులు ఇంటి వద్ద చదువుకునేలా వాతావరణాన్ని కల్పించాలన్నారు. టీవీలకు, మొబైల్స్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రతీ విద్యార్థి మంచి గ్రేడ్‌ లో ఫలితాలు సాధించేలా అవసరమైన సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రుల సహకారం కూడా తప్పనిసరియని కోరారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై స్పెషల్‌ డ్రైవ్‌



చిట్కుల్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌ సింధూజ



నార్సింగి మండల కేంద్రంలో ..

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్‌ సింధూజ అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని చిట్కుల్‌ గ్రామంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ వెంకటేశ్‌, బీఎల్‌ఓలు శ్యామల, షహనాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్‌): ఓటరు నమోదుపై మండలంలోని బీఎల్‌ఓ కేంద్రాల వద్ద శనివారం స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల వద్ద నూతన ఓటర్ల నమోదుతో పాటు ఓటరు నమోదులో మార్పులపై ప్రజల నుంచి బీఎల్‌ఓలు దరఖాస్తులను స్వీకరించారు. ఆయా కేంద్రాలను తహసీల్దార్‌ గ్రేస్‌బాయి, డిప్యూటీ తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఆర్‌ఐ.శరణప్ప పరిశీలించారు.

ఓటరు ప్రక్రియ పరిశీలన

నిజాంపేట(మెదక్‌): మండలంలోని చల్మెడ గ్రామంలో సర్పంచ్‌ నర్సింహరెడ్డి, ఆర్‌ఐ గంగాదర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటనర్సింహరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిజాంపేట(మెదక్‌): చల్మెడలో..

నార్సింగిలో..

చిన్నశంకరంపేట(మెదక్‌): నార్సింగి మండల కేంద్రంలో ఓటరు నమోదు చేపట్టారు. నార్సింగి గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన ఓటరు నమోదు కేంద్రంలో పెద్ద సంఖ్యలో యువత దరఖాస్తులు అందించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉప తహసీల్దార్‌ కౌషిక, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ మాధవి పరిశీలించారు.

ఎల్‌ఓసీల అందజేత



ఎల్‌ఓసీని అందిస్తున్న రాజిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్‌): మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన రామ్‌ అనే యువకుడికి ఆస్పత్రి ఖర్చుల కోసం రూ. 1లక్ష 25 వేల ఎల్‌ఓసీని నర్సాపూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అందించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్‌, మెదక్‌ జిల్లా పార్టీ నాయకుడు శేఖర్‌, మండల ఉపాధ్యక్షుడు గోవర్దన్‌, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు వెంకట్‌గౌడ్‌, అల్లి చందు, బీరప్ప, సాయి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌ రూరల్‌: అత్యవసర చికిత్స అవసరమున్న ఇద్దరికీ రూ.2 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను శనివారం నర్సాపూర్‌ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు.



నర్సాపూర్‌ క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మత్తులో బాల్యాన్ని చిత్తు చేసుకోవద్దు

పాపన్నపేట(మెదక్‌): అందమైన బాల్యాన్ని మత్తులో చిత్తు చేసుకోవద్దని ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోషకుల సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఇటీవల కొన్ని చోట్ల పాఠశాల సమీపంలో ఉన్న పాన్‌ డబ్బాలు, కిరాణం దుకాణాల్లో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఈ విషయమై టీచర్లు, పోషకులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎం మహేశ్వర్‌ మాట్లాడుతూ.. ప్రతీ నెల మూడో శనివారం పోషకుల సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ మంజుల, పోషకులు, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ మహిపాల్‌ రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ థర్మకోల్‌ అయోధ్య రామమందిర నమూనా



చేగుంట(తూప్రాన్‌): థర్మకోల్‌ షీట్‌లను ఉపయోగించి అయోధ్య రామమందిర నమూన చిత్రంను వడియారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ తయారు చేశారు.

◆ ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికలకు సహకరించండి

చిన్నశంకరంపేట(మెదక్‌): పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌ రెడ్డి కోరారు. శనివారం చిన్నశంకరంపేటలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదలపై ప్రకటన చేశారు.

◆ మెరుగైన ఫలితాల సాధనకు కృషి

చిన్నశంకరంపేట(మెదక్‌): ప్రభుత్వ కళాశాలలో మెరుగైన ఫలితాల సాధన కోసం అధ్యాపకులు, విద్యార్థులు కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి విజయ్‌శేఖర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ నాగేందర్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ సన్మానం

కౌడిపల్లి(నర్సాపూర్‌): ముత్రాజ్‌పల్లి ఉపసర్పంచ్‌కు మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సతీశ్‌ దంపతులు కారు బహుమతిగా ఇవ్వడంతో పాటు ఉపసర్పంచ్‌, వార్డు సభ్యులను సన్మానించారు.

◆ ప్రారంభమైన మల్లికార్జునస్వామి జాతర

నర్సాపూర్‌ రూరల్‌: మండలంలోని నత్నయ్యపల్లిలో వెలిసిన మల్లికార్జునస్వామి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు.

◆ బీడీ కార్మికుల పింఛన్‌ పెంచండి

రామాయంపేట(మెదక్‌): బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు రూ. 8 వేలకు పెంచాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం డిమాండ్‌ చేశారు. ఆయన శనివారం రామాయంపేట వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. బీడీ కార్మికుల పింఛన్లు పెంచుతామని గతంలో పలు పార్టీ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

◆ 21 నుంచి మల్లికార్జునస్వామి ఉత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని రాయిలాపూర్‌లోని మల్లికార్జునస్వామి, రేణుకా ఎల్లమ్మదేవి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు 21 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాత, నిర్వాహకులు శామీర్‌పేట మాజీ సర్పంచ్‌ నర్సింగారావు, నాగ్సాన్‌పల్లి సర్పంచ్‌ ఎల్లం తెలిపారు.

◆ ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

శివ్వంపేట(నర్సాపూర్‌): మండలంలో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు చేశారు. గుర్తించిన పోలింగ్‌ నమోదు కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీనివాస్‌చారి, ఉప తహసీల్దార్‌ షఫీయొద్దీన్‌, ఆర్‌ఐ కిషన్‌, సిబ్బంది ఉన్నారు.

◆ బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

శివ్వంపేట(నర్సాపూర్‌): బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో పలు కుటుంబాలను శనివారం పరామర్శించారు.

నర్సాపూర్‌ రూరల్‌: ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను శనివారం నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. నర్సాపూర్‌ సాక్షి రిపోర్టర్‌ భిక్షపతి తల్లి గుజ్జరి లక్ష్మి, చిన్నచింతకుంట సొసైటీ డైరెక్టర్‌ రవిగౌడ్‌ తండ్రి వెంకటస్వామి గౌడ్‌, దుర్యా తండాకు చెందిన దుర్గ్య నాయక్‌ ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. మున్సిపల్‌ చైర్మన్‌ నయీమొద్దీన్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు అశోక్‌గౌడ్‌, శేఖర్‌ ఉన్నారు.

◆ కమిటీల పేరుతో కాలయాపన వద్దు

మెదక్‌ కలెక్టరేట్‌: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడుతామన్న బీజేపీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని ఎమ్మార్పీఎస్‌ టీఎస్‌ మెదక్‌ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌ ఆరోపించారు. శనివారం మెదక్‌ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్‌ టీఎస్‌ మెదక్‌ మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్‌ టీఎస్‌ రాష్ట్ర కార్యదర్శి లింగం ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎమ్మార్పీఎస్‌ టీఎస్‌ మెదక్‌ మండల ఉపాధ్యక్షులుగా గట్టుపల్లి ఏసు, నారాయణ, సామేలు, ప్రభాకర్‌, దేవయ్య, ప్రభాకర్‌, నర్సింలు, శీను, నర్సింలు, పోచయ్య, యేసులను కార్యవర్గంలో ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్‌ టీఎస్‌ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌, రాష్ట్ర కార్యదర్శి సంజీవులు, జిల్లా నాయకుడు దేవదాస్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ చాకరిమెట్లలో భక్తజన సందడి

శివ్వంపేట(నర్సాపూర్‌): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. శనివారం ఉదయం భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ శ్రీనివాస్‌, ఆలయ ఫౌండర్‌, చైర్మన్‌ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు ఉన్నారు.

◆ గడప గడపకు అయోధ్య అక్షింతలు

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల పరిధిలోని గూడూర్‌ గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి ఆలయంలో యువకులు పూజలు నిర్వహించారు.

నిజాంపేట(మెదక్‌): మండల పరిధిలోని శౌకత్‌పల్లి గ్రామంలో శ్రీరామ జన్మభూమి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు.

◆ కేసు నమోదు

అల్లాదుర్గం(మెదక్‌): వ్యవసాయ భూమిలో హద్దు కడీలను ధ్వంసం చేసినందుకు నలుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. మండలంలోని కాయిదంపల్లి గ్రామానికి చెందిన తిమ్మాపూరం పాపమ్మకు గ్రామ శివారులోని సర్వే నెంబర్‌ 19/ఎ/2 లో ఎకర 13 గుంటల భూమి ఉంది. ఇందులో హద్దుల కోసం భూమిలో కడీలను ఏర్పాటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన బేస్తా వెంకయ్య, సుధాకర్‌, బేతమ్మ, నాగరాజులు కడీలను ధ్వంసం చేశారు. దీంతో పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ తండ్రి మందలింపుతో కొడుకు ఆత్మహత్య

హవేళిఘణాపూర్‌(మెదక్‌): జులాయిగా తిరుగుతున్న కుమారుడిని తండ్రి మందలించాడు. మనస్తాపానికి చెందిన అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్‌ మండలం రాజ్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్‌ అహ్మద్‌ పెద్ద కుమారుడు హర్షద్‌ (24) మొత్తానికే పని లేకుండా తిరుగుతున్నాడని ఈనెల 12న మందలించాడు. మనస్తాపం చెందిన అతను గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయాన్ని స్థానికులు కుటుంబ సభ్యులకు చేరవేయగా వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మెదక్‌ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక హాస్పిటల్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. రూరల్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.